ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583.50 (293.1090)	3,54,718	4,31,678
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.25 (4.00)	1,227	3,891
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.948 (32.837)	3,70,063	3,41,504

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



హుజూర్‌నగర్ ఎస్ఎస్‌పీ క్యాంప్ ప్రాంతంలో లింగగిరి మేజర్‌పై రింగ్ రోడ్డుకు ప్రతిపాదించిన ప్రాంతం ఇదే.

- ఎన్నెస్పీ కాల్వ మీదుగా నిర్మాణానికి సన్నాహాలు
- మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశంలో స్థానికుల విన్నపాలు
- లింగగిరి మేజర్‌కాల్వ కట్ట నుంచి రింగ్ రోడ్డు

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణం చుట్టూ మరో రింగ్ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నూతన రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. లింగగిరి మేజర్ కాల్వ కట్టపై ఎడమవైపు నుంచి నూతన రింగ్‌రోడ్డు నిర్మించాలని కోరారు. అయితే హుజూర్‌నగర్‌ను సుందరీకరించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు రావడంతో ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోంది. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ ఆర్ అండ్‌బీ, ఎన్నెస్పీ, మునిసిపల్ అధికారులను ఆదేశించారు.

- (ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

హుజూర్‌నగర్‌కు మరో రింగ్‌రోడ్డు!



దీక్షిత్‌నగర్‌లో ఎన్నెస్పీ కాల్వను ఆక్రమించి నిర్మించుకున్న ఇళ్లు

హుజూర్‌నగర్ పట్టణంలో ఒక్కటే ప్రధానరహదారి ఉంది. ట్రాఫిక్ పెద్దఎత్తున ఉండడం తో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. భారీ వాహనాలు సైతం పట్టణంలోని ఇందిరాసెంటర్, మెయిన్‌రోడ్డు, లింగగిరి రోడ్డు నుంచి వెళ్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకల నియంత్రణకు పట్టణంలోని నడుబొడ్డున మరో రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారపార్టీ నాయకులు, ప్రజల నుంచి డిమాండ్ మొదలైంది.

పదేళ్లలో అసంపూర్తిగా..

ఇదిలాఉండగా 2013లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు రూ.22 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర అవుట్ రింగ్ రోడ్డు పనులు చేపట్టారు. కోదాడ రోడ్డులోని మాధవరాయనిగూడెం సమీపంలోని ముక్త్యాల బ్రాంచ్ కాల్వ నుంచి వేపల సింగారంలోని గోదాంల వరకు సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మించారు. దానికి అనుసంధానంగా లింగగిరి మేజర్ కాల్వ కట్ట మీదుగా లింగగిరి మేజర్‌కు కుడి వైపు నుంచి కాచవారిగూడెం స్టేజీవరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూ రు చేశారు. కాగా గత ప్రభుత్వం పదేళ్ల పాటు పనులు పూర్తిచేయలేదు. 9 కిలోమీటర్లలో కేవలం మూడు కిలోమీటర్లు మాత్రమే రింగ్ రోడ్డు నిర్మించి మిగతా పనులు వదిలేశారు. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మరో రూ.5కోట్లు మంజూరు చేయగా ప్రస్తుతం పనులు చివరి దశలో ఉన్నాయి. పట్టణ పరిధిలోని మల్లన్ననగర్, దీక్షిత్, సీతారాంనగర్ ప్రాంతాల్లో మెటల్ రోడ్డు వేశారు. దానిపై బీటీ వేయాల్సి ఉంది. ఇది కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా పను లు పూర్తికాలేదు. గతంలో 2013కు ముందు అవుటర్‌రింగ్ రోడ్డు ప్రారంభానికి ముందు లింగగిరి మేజర్ కుడి వైపు కాల్వ కట్టపై ఇళ్లు ఉండగా వారందరికీ ఫణిగిరిగట్టు వద్ద సుమారు 200మందికి ఇళ్లు మంజూరుచేశారు. దీంతో అక్కడే ఉంటున్నారు. కాగా కాల్వ కట్టపైన ఔట ర్ రింగ్‌రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఎడమ వైపు పెరిగిన డిమాండ్..

పట్టణంలో వాహన రాకపోకల నియంత్రణ కోసం లింగగిరి మేజర్ కాల్వకు ఎడమవైపు మరో రింగ్ రోడ్డు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో భూసేకరణ సమస్య ఏర్పడే అవకాశం ఉంది. పట్టణానికి ఆనుకుని కొంతభాగం, ఊరికి మధ్యలో కొంతభాగం లింగగిరి మేజర్ కాల్వ ప్రవహిస్తోంది. దీంతో మేజర్‌కు ఎడమవైపు రోడ్డు నిర్మించాలంటే 30 ఏళ్లుగా కాల్వకట్టను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుని సుమారు 200 మంది జీవిస్తున్నారు. వారందరికీ పునరావాసం కల్పించాల్సి ఉంది. ఫణిగిరి గట్టు వద్ద నిర్మాణంలో ఉన్న 2,160 మోడల్ కాలనీలో ఇళ్లు ఇవ్వాలని అధికార పార్టీ నాయకులు మంత్రి ఉత్తమ్‌కు...

- మిగతా 8వ పేజీలో...

విజృంభిస్తున్న డెంగీ

- చికిత్స పొందుతున్న 67 మంది
- వణుకు పుట్టిస్తున్న సీజనల్ వ్యాధులు



అనంతారం గ్రామంలో షేక్ సామ్రిన్(బాలింత) ఆరోగ్య పరీక్షల రిపోర్టును పరిశీలిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్

వైద్యచికిత్సలతో ఆర్థికభారం

జ్వరాల బారిన పడిన రోగులు జేబులు సైతం ఖాళీ అవుతున్నాయి. వారం రోజుల కిందట నాలుగో తరగతి ఉద్యోగి కుమారుడికి దగ్గు, జలుబుతో కూడిన జ్వరం వచ్చింది. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయిస్తే టైఫాయిడ్‌గా నిర్ధారణ అయ్యింది.చికిత్స అందిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి వరకు రూ.10 వేల ఖర్చు కాగా ఇంకా జ్వరం తగ్గలేదు.

సీజనల్ వ్యాధులు ప్రజలను వణికిస్తున్నాయి. పెద్దలు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా వ్యాధులు వస్తున్నాయి. జిల్లాలో 67 డెంగీ కేసులు నమోదయ్యాయి. శుక్రవారం నాలుగు డెంగీ కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కేసులతో పాటు ఇతర వ్యాధిగ్రస్తులతో ఆర్‌ఎంపీ, ప్రైవేట్ దవాఖానాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు కిక్కిరిస్తున్నారు. 20 రోజులుగా కురిసిన వర్షాల తో వ్యాధులు ప్రబలుతున్నట్లు వైద్యులు తెలిపారు. రానున్న రోజుల్లో జ్వరపీడితులు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భానుపురి)

రెండ్రోజుల నుంచి వర్షాలు లేకున్నా మరింత వ్యాధుల సంఖ్య పెరుగుతోంది. దోమకాటుతో విషజ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. పరిశుభ్రతపై ప్రభుత్వ సిబ్బంది సక్రమంగా అవగాహన కల్పించకపోవడంతో వ్యాధులు మరింత ఉధృతమవుతున్నాయి.ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ఎక్కువగా ప్రైవేట్ ఆసుపత్రులను రోగులు ఆశ్రయి స్తున్నారు. రెండు నెలల్లోనే డెంగీ కేసులు జిల్లాలో 67కు చేరుకున్నాయి.జ్వరాలు మాత్రం జిల్లాలో 948 నమోదైనట్లు తెలుస్తోంది.మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వ్యాధులు నమోదు కాలేదని వైద్యులు తెలిపారు. కో దాడ మండలం తొడ్వాయి, కలకోవ, కోదాడ అర్బన్,రావులపల్లి, బూరుగడ్డ, చీదేళ్ల, సూర్యాపేట పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, రాజీవ్‌నగర్, పెన్‌పహాడ్, అనంతగిరి ప్రాంతాల్లో డెంగీకేసులు నమోదయ్యాయి. డెంగీ కేసులు నమోదవుతుండటంతో వైద్య సేవలపై దృష్టి సారించాలని కలెక్టర్ వైద్యసిబ్బందిని ఆదేశించారు.

జ్వరసర్వేతో పాటు పరీక్షలు..

ఈ ఏడాది జూన్ నుంచి జ్వరసర్వే...

- మిగతా 8వ పేజీలో...

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి : ఎస్పీ



జిల్లా పోలీస్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేటక్రైం, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ పిలుపునిచ్చారు వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డితో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట, కోదాడ డీఎస్పీలు ప్రసన్నకుమార్, మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, ఎస్‌బీఐ రామారా వు, సీఐలు శివశంకర్, నర్సింహారావు, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, నాగేశ్వర్‌రావు, చరమందరాజు, ప్రతాపలింగం, లక్ష్మీనారాయణ, హరిబాబు,ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

సాంకేతికతతో నేరాలను నియంత్రించాలి

అధునాతన సాంకేతికతను వినియోగించుకుని నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ నర్సింహ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసుల నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. దుకాణాల సముదాయాలు, కాలనీలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రానున్న గణేష్ నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు పకడ్బందీగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, మఠంపల్లి ఎస్ఐ బాబు, ఐటీ సెల్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్, నాగారం ఎస్ఐ ఐలయ్య, సూర్యాపేట రూరల్ ఎస్ఐ-2 వెంకట్రాములు, సిబ్బంది శంబయ్య, రామారావును అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సూర్యాపేట, కోదాడ డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 22,(ఆంధ్రజ్యోతి): వానాకాలంలో రైతులు పండించే ధాన్యాన్ని సేకరించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతేడాదిలో ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్స్‌ను కొనుగోలు చేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో అప్పారావు, డీఎస్‌వో మోహన్‌బాబు, డీసీవో పద్మజ, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీఎంవో సంతోష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

ప్యాడీ క్లీనర్లు రైతులకు ఉపయోగం

భానుపురి :ఆటోమెటిక్ ప్యాడీక్లీనర్లతో రైతులకు ఉపయోగం ఉంటుందని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం డెమో కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వం పాత ప్యాడీక్లీనర్లను అధునాతనంగా మార్చినట్లు చెప్పారు. 17 శాతం తేమ తెచ్చేందుకు ఒకేసారి 30క్వింటాళ్ల ధాన్యం ఆరబెట్టే డ్రయర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సంతోష్‌కుమార్ ఉన్నారు.

వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

చివ్వెంల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంగా చదివి వార్షిక ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సూచించారు. మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భవిత కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులకు బయోసైన్స్ డిజిటల్ బోధనను విద్యార్థులతో కలిసి బెంచీపై కూర్చొని వీక్షించారు. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, సెప్టెంబర్ 1 నుంచి అదనపు తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు. విద్యార్థులు చదవడం, రాయడంపై దృష్టి సారించాలని సూచించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి సైగలతో అంకెలు, కలర్స్ మ్యాచింగ్‌లను విద్యార్థులతో చేయించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలన

తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న లబ్ధిదారులు సోని ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా అందజేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. భూభారతి అర్జీలపై కార్యాలయంలో సమీక్షించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరిగాయని వైద్యాధికారిని వివరాలు అడిగారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు,వైద్యాధికారి భవాని,పార్థసారథి, ఎంఈవో కళారాణి పాల్గొన్నారు.

జీవనోపాధి పెంపునకు పనుల జాతర

గ్రామీణ ప్రజల జీవనోపాదులను మెరుగు పరచడానికి ఉపాధి హామీ పథకంలో పనుల జాతరను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పన ద్వారా పల్లెల్లో ప్రగతికి తోడ్పాటు అందించేందుకు ఈ పథకం ప్రారంభించారని తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి రాములు నిర్మించిన పశువుల పాకను ప్రారంభించారు. నిర్మాణానికి ఎంత ఖర్చయిందని, పశువులు ఎన్ని ఉన్నాయి, పాలు ఎక్కడ విక్రయిస్తారని రాములును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎల్కా ప్రమీల పశువుల పాకకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీవో నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమం తప్పదు



సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

అనంతగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్కా సోమయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం రెండో మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా జిల్లాలో పెండింగ్ ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, నూతన విధానాలతో సంక్షేమ పథకాలను కార్మికులకు దూరం చేస్తుందని విమర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగు రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పవద్దన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూకల కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా మాదాసు శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మాదాసు సంగయ్య, సహాయ కార్యదర్శిగా మాదాసు శ్రీను, (ఎన్జీఆర్) కమిటీ సభ్యులుగా మట్టపల్లి ఉపేందర్, చల్ల కనకయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండు ఉపేందర్‌గౌడ్, దార్ల గురవయ్య, మాదాసు గామయ్య, సురేష్, బ్రహ్మచారి, గోపి, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, ఉపేందర్, సత్యనారాయణ, పాపయ్య, రాంబాబు పాల్గొన్నారు.

మార్వాడీల అక్రమ వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానిక వ్యాపారులు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండా అక్రమంగా వ్యాపా రం సాగిస్తున్న మార్వాడీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూర్యాపేట పట్టణ సిమెంట్, ఐరన్ హార్డ్‌వేర్, శానిటరీ, పెయింట్స్ ప్లైవుడ్, శానిటరీ, ఎలక్ట్రికల్ వ్యాపార సంఘాల జేఏసీ అధ్యక్షుడు ఫిరోజ్, సోమదయాకర్, వెంపటి నవీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సూర్యాపేట డివిజన్ బంద్‌ని నిర్వహించి మాట్లాడారు. మార్వాడీ మాఫియాను అరికట్టాలన్నారు. మార్వాడీ వ్యా పారుల పెద్ద ఎత్తున దుకాణాలు ఏర్పాటు చేస్తూ నాసిరకం వస్తువులు విక్రయిస్తున్నార ని ఆరోపించారు. మర్వాడీ దుకాణాల్లో స్థానిక వ్యక్తులకు వర్క ర్లు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అనంతరం జిల్లా కేంద్రంలో బైకు ర్యాలీ నిర్వహించారు.

- సూర్యాపేట ఎలక్ట్రికల్ దుకాణాల యూనియన్ ఆధ్వర్యం లో శుక్రవారం మార్వాడీ గోబ్యాక్ అంటూ దుకాణాల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ అధ్యక్షుడు పిట్టల(భాగ్యశ్రీ)వెంకన్న మాట్లాడుతూ మార్వాడీలు నాసిరకం వస్తువులతో వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు వారి దుకాణాల్లో పనికల్పించకుండా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వ్యాపారులు ధర్మారావు, రుద్రంగి రాము, నల్లపాటి శ్రీధర్, శ్రీకాంత్, పూర్ణ, సురేష్‌రావు, ప్రశాంత్, భరత్, సైదులు, శ్రీకాంత్, శ్యాం, ఉమాశంకర్, వేణు, బ్రహ్మచారి పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి

డీఎంహెచ్‌వో చంద్రశేఖర్



క్లినిక్‌ను సీజ్ చేసిన డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

మునగాల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రూరల్ ప్రాక్టీషనర్ (ఆర్‌ఎంపీ)లు ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలని, అంతకు మించి వైద్యం చేస్తే కఠినచర్యలు ఉంటాయని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ చంద్రమౌళి ఆస్పత్రిగా నిర్వహించడంపై ఆగ్రహించి ఆస్పత్రిని సీజ్ చేశారు. ఇక్కడ స్థాయికి మించి వైద్యం చేయడంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 మంది పేషెంట్లకు క్లినిక్ నిర్వాహకుడు ఇచ్చిన ఇంజక్షన్, సెలైన్ బాటిల్‌ను ఆయన పరిశీలించారు. ప్రజారోగ్యానికి హానిచేసే ఇంజెక్షన్లు ఇవ్వడంతో తక్షణమే రోగులకు ఉపశమనం పొందినా ఆ తరువాత వారు అనారోగ్యం పాలవుతారన్నారు. అర్హత లేకున్నా ప్రజలకు వైద్యం చేయడం నేరమని హెచ్చరించారు. ఏ ప్రాంతంలోనైనా అనుమతి లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. క్లినిక్‌లో ఉన్న రోగులను 108లో ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో జయమనోహరి, వైద్యాధికారి రవీందర్ ఉన్నారు.

నానో యూరియాపై అవగాహన కల్పించాలి

సూర్యాపేటరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : నానో యూరియా వినియోగంపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని డీఏవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాలెంలలో రైతు బీరెల్లి రామచంద్రరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నానో యూరియా, నానో డీఏపీ మందును డ్రోన్ ద్వారా పిచికారీ చేసే పద్ధతిని రైతులకు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నానో యూరియా వాడకంతో పంట దిగుబడిలో అద్భుత ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నానోతో పర్యావరణ పరిరక్షణ, నేలకు, పంటకు మేలన్నారు. నానో యూరియాపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో కృష్ణ సందీప్, ఏఈవో సుష్మ, డ్రోన్ ఆపరేటర్ మధుసూదన్, రైతులు శ్రీనివాస్‌గౌడ్, సైదులు, వీరసోములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మిత్రుడి ప్రయత్నానికి సహాయంగా..

● 30 ఏళ్ల అనంతరం దేశానికి.. ● పశుగణాల సేవలో వైద్యుడు పెంటయ్య
● రూ.20 వేలు విరాళంగా అందజేసిన మిత్రుడు సుధాకర్

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)

దేశంలో ఎక్కడాలేని విధంగా పశు ఔషధ బ్యాంక్ ఏర్పాటుచేసిన మిత్రుడిగా అండగా నిలిచారు సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఎన్‌ఆర్ఐ చప్పిడి సుధాకర్. ఇందుకోసం 30 ఏళ్ల తర్వాత స్నేహితుడిని కలిశారు. వివరాలు ఇలా ఉన్నాయి.



మిత్రుడు అందజేసిన విరాళాన్ని తీసుకుంటున్న పెంటయ్య(తెల్లచొక్కా వ్యక్తి)

30 ఏళ్ల కిందట హైదరాబాద్‌లోని పశువైద్యకళాశాలలో చప్పిడి సుధాకర్, పీ పెంటయ్యలు సహచర విద్యార్థులు. సుధాకర్ చదువు పూర్తయ్యాక అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పెంటయ్య ఉద్యోగంలో చేరి ప్రస్తుతం కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కోదాడలో విధుల్లో చేరి నాటి నుంచి పశుఆరోగ్య సేవలతో పాటు పశుపోషకుల సంక్షేమం కోసం వినూత్నంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పశుపోషణ భారం కాకుండా రైతులు లాభాల బాటలో నడవడానికి వైద్య, మేపు ఖర్చులు తగ్గించడానికి దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారి దాతల సహకారంతో పశుఔషధ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని ఉచితంగా, మరికొన్ని సబ్సిడీపై ఔషధాలు అందిస్తున్నారు. ఈ విషయం తెలిసిన స్నేహితుడు సుధాకర్ మూగజీవాల సేవలో తాను సైతం చేయి కలుపుతానంటూ ముందుకు వచ్చారు. తండ్రి గాబ్రియేల్ పేరు మీద రూ.20000 విరాళంగా ఇచ్చేందుకు 30 ఏళ్ల తర్వాత అమెరికా నుంచి వచ్చారు. స్నేహితుడు పెంటయ్యను కలిసి విరాళాన్ని అందజేశారు. చాన్నాళ్లకు స్నేహితుడిని చూసిన పెంటయ్య ఆశ్చర్యానికి గురయ్యారు. తన ప్రయత్నాలకు అందించిన విరాళాన్ని సద్వినియోగం చేస్తానన్నారు. ఈ సందర్భంలో తమ కలయికకు గుర్తుగా పశువైద్యశాల ఆవరణలో పండ్లలో శ్రేష్ఠమైన హిమాయత్ పసంద్ మామిడి మొక్కను నాటారు. అలాగే వీరిద్దరి క్లాస్‌మెట్ సూర్యాపేట పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బీ వెంకన్న కూడా మిత్రులతో కలిసి ఆనందం పంచుకున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు సాగర్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బీసీ గురుకుల విద్యాలయ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. అండర్-18 విభాగంలో పరుగుపందెంలో నంద కిషోర్ స్వర్ణం, జావెలిన్ త్రోలో దినేష్ స్వర్ణం, లాంగ్ జంప్‌లో రజతం, అండర్-16 విభాగంలో పరుగుపందెంలో గణేష్ స్వర్ణం, లాంగ్ జంప్‌లో స్వర్ణం, అరవింద్, హరి, రవి తేజలు ప్రతిభ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

దర్వేశిపురంలో కుంకుమ పూజలు



అమ్మవారికి నిర్వహించిన కుంకుమపూజకు హాజరైన భక్తులు

కనగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. సామూహిక కుంకుమపూజలో పాల్గొన్నారు. ఇష్టదైవానికి చీరసారె, ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం శివుడి విగ్రహం వద్ద దీపారాధన చేశారు. ముడుపులు కట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

నల్లగొండ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):నిర్మాణరంగంలోని కార్మికులకు బకాయిలను వెల్ఫేర్ బోర్డు వెంటనే చెల్లించాలని, బోర్డు దుబారా ఖర్చులను ఆపాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నల్లగొండ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు కంచి కేశవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ప్రమాద, సహజ మరణం, పెళ్లికానుక, ప్రసూతి కానుక తదితర లబ్ధికోసం దరఖాస్తు చేసుకొని నెలల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. అయినా పరిష్కరించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నల్లగొండ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, అద్దంకి నరసింహ, సైదాచారి పాల్గొన్నారు.

తల్లిని పూజిస్తే జీవితం సుఖమయం:బిషప్ ధమన్



నల్లగొండ కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : మరియరాణిని భక్తితో పూజిస్తే జీవితం సుఖమయంగా ఉంటుందని బిషప్ కరుణం ధమన్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రం దేవరకొండరోడ్డులోని మరియరాణి కేథ్రిడల్ చర్చిలో శుక్రవారం చర్చి మహోత్సవంలో భాగంగా పూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధమన్ మాట్లాడుతూ మరియరాణి తల్లిని పూజించే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందన్నారు. తల్లిని భక్తితో పూజిస్తే మంచి జరుగుతుందనే నమ్మకం భక్తుల్లో ఉందన్నారు. సాయంత్రం మరియరాణి విగ్రహాన్ని అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో విశ్రాంతి బిషప్ గోవింద్ జోజి, విచార ఫాదర్ జీ బాలస్వామి, అర్నారెడ్డి, రాయప్ప, బాలశౌరిరెడ్డి, శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిల భారం మోయలేం



పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం పొందేందుకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చింది. గతంలో రూ.5 లక్షల వరకు ఉన్న వైద్య సేవలను ప్రభుత్వం ఇటీవల రూ.10 లక్షలకు పెంచింది. బీఆర్‌ఎస్ హయాంలో ఏడాది బకాయిల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బకాయిల్లో కేవలం 10 శాతం మాత్రమే విడుదల చేసింది. ఒక్కో ఆసుపత్రికి ప్రభుత్వం రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు ప్రైవేట్ ఆసుపత్రులకు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాలానుగుణంగా ధరలను పునఃసమీక్షించడంతో పాటు బకాయిలు చెల్లించాలని యజమాన్యాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 31లోగా నిధుల విడుదల, ధరల పునఃసమీక్ష చేయని పక్షంలో 31వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటిస్తున్నారు.

» ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతకు ఆసుపత్రులు సన్నద్ధం
» వారంలో నిధుల విడుదలకు, ధరల పునఃసమీక్షకు డిమాండ్

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను అలస్యంగా విడుదల చేస్తోంది. దీంతో కొన్ని ఆసుపత్రుల్లో రోగులను సదుపాయలు లేవన్న సాకుతో తిప్పిపంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఆసుపత్రి నిర్వాహకులకు ఔషధాలు, వైద్యులు, నర్సుల జీతాలు, ఆసుపత్రి నిర్వహణ భారంగా పరిణమిస్తోందని అంటున్నారు. ధరల పెరుగుదలను అనుసరించి వైద్య చికిత్స ధరలను పెంచాల్సివుండగా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉద్యోగుల, జర్నలిస్టుల ఆరోగ్య పథకం కింద 2 ఏళ్లకుపైగా బకాయిలు విడుదల చేయలేదని విమర్శిస్తున్నారు.

నూతనంగా మరో 163 వ్యాధులకు చికిత్సలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2007లో సీఎం రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి, తెల్లరేషన్‌కార్డు కలిగిన పేదలకు కొన్ని దీర్ఘకాలిక, ఖరీదైన వైద్యం పొందేందుకు వెసులుబాటు కల్పించారు. ఆయా ఖర్చులను ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వమే ఆసుపత్రులకు విడుదల చేస్తోంది. బీఆర్‌ఎస్ హయాంలో 1,672 వ్యాధులకు చికిత్స అందించగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అదనంగా 163 వ్యాధులను కలిపి మొత్తంగా 1,835 రకాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ కలిగిన ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సను పొందే విధంగా అవకాశం పెంపొందించారు. డయాలసిస్ మొదలుకొని గుండెజబ్బుల వరకు ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించారు. గతంలో రేషన్‌కార్డు కలిగిన కుటుంబ సభ్యులందరికీ రూ.5 లక్షల్లోపు వైద్యం పొందే అవకాశం ఉండగా, ఆ మొత్తాన్ని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచారు.

రెండేళ్లుగా పెండింగ్‌లోనే బిల్లులు

ఉద్యోగుల, జర్నలిస్టుల ఆరోగ్య పథకింద బిల్లులు 2023 నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. వైద్యం చేస్తే వచ్చే డబ్బుల కన్నా రోగి చికిత్సకు మందులు, శస్త్ర చికిత్స ఖర్చులకు డబ్బులు లేక కొన్ని ఆసుపత్రులు సౌకర్యాల లేమి పేరుతో రోగులను మరో చోటుకు పంపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.కోట్ల బకాయిలతో ఆసుపత్రులు నిర్వహించడం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం బకాయిలు విడుదల చేయని పక్షంలో ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలు నిలిపివేస్తామని ఆసుపత్రి వర్గాలు ప్రభుత్వ ఆరోగ్యశ్రీ సీఈవోకు నోటీసులు ఇచ్చాయి.

నిధులు విడుదల చేయకుంటే సేవలు బంద్



రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మరో ఎనిమిది రోజుల్లో ప్రభుత్వం బకాయిలు చెల్లించనిపక్షంలో ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తాం. బకాయిలు క్రమం తప్పకుండా విడుదల చేస్తామని ప్రభుత్వం హామీఇచ్చి పాటించడం లేదు. వైద్య చికిత్స ధరలను పునఃపరిశీలించాలి. ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ బిల్లులు రెండు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. బకాయిలు విడుదల కాకుంటే ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మరుతోంది. ప్రభుత్వం సత్వరమే బకాయిలు విడుదలకు చర్యలు చేపట్టాలి.

- డా. మువ్వా రామారావు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

ఉమ్మడి జిల్లాలో రూ.100 కోట్ల వరకు బకాయీలు?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 56 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం(జేహెచ్‌ఎస్) కింద వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల, జర్నలిస్టులకు వైద్యసేవలకు ప్రభుత్వం కొంతకాలంగా నిధులు విడుదల చేయకపోవడంతో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారిందంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ బకాయిలు సుమారు రూ.100 కోట్ల వరకు ఉన్నట్లు వైద్యరంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. గత జనవరిలో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించి 10 శాతం నిధులు మాత్రమే విడుదల చేసినట్లు ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. చర్చల సందర్భంలో ప్రభుత్వం క్రమం తప్పకుండా బకాయిలు చెల్లింపు, ధరల పునరుద్ధరణ చేస్తామని మాట ఇచ్చి పాటించడం లేదని ఆరోపిస్తున్నారు.

ప్రతి వర్షపు నీటిబొట్టునూ ఒడిసిపట్టాలి



కొంపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రావు

మునుగోడు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో కురిసిన ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టాలని, అప్పుడే భూగర్భజలాలు పెరిగి నీటికష్టాలు తీరుతాయని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలో ప్రజాజాతర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని వీధులు, మురుగుకాల్వలను, హరితహారం చెట్లను, వీధుల్లో పరిశుభ్రతను పరిశీలించి గ్రామ కార్యదర్శి స్వామిని అభినందించారు. వెదిరే పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉపాధి పథకంతో ఎక్కువ నిధులు సాధించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలన్నారు. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. మహిళల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి, వారిని కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి పథకంలో 100 రోజులు పనికి వెళ్లిన జీడిమడ్ల లింగయ్య, గోలి బిక్షంను గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ జీడిమడ్ల దశరథను సన్మానించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఇంకుడుగుంతకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వెదిరె ఫౌండేషన్ సభ్యులు వెదిరె విజేందర్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, ఏపీడీ నవీన్‌కుమార్, ఎంపీడీవో యుగేందర్, ఎంపీవో పర్వేజ్, ఏపీవో నాగరాజు, కార్యదర్శి స్వామి, మాజీ సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, ఈసీ జీడిమడ్ల మల్లేష్ ఉన్నారు.

చివ్వెంలలో పట్టపగలే హత్యాయత్నం

● కారులో వెంబడించిన నలుగురు
● పరుగెత్తి ప్రాణాలు కాపాడుకున్న బాధితులు



తమపై దాడి చేసేందుకు కారులోంచి దిగుతున్న వ్యక్తిని చూసి పరుగెడుతున్న లక్ష్మయ్య, ఆయన భార్యలు

చివ్వెంల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దాడిచేసిన వ్యక్తిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళుతున్న వారిపై పట్టపగలే హత్యాయత్నం జరిగింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు భార్యలతో వెళుతుండగా కారులో వెంబడిస్తుండటాన్ని గమనించిన బాధితుడు సమీపంలోని వైన్స్ దుకాణంలోకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నాడు. శుక్రవారం సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన దండుగుల లక్ష్మయ్యకు ఇద్దరు భార్యలు కాగా, రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. ఓ వివాదంపై కుడకుడకు చెందిన దండుగుల శేఖర్‌పై లక్ష్మయ్య చివ్వెంల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడి పరిష్కరించుకున్నారు. లక్ష్మయ్య సోదరుడు కొట్టిన రాళ్లను పల్లపు గోపి, అతని కుటుంబ సభ్యులు తీసుకెళ్లిన ఘటనలో గోపి డబ్బులు చెల్లించాలని పెద్ద మనుషులు తీర్మానించారు. ఇందుకు సంబంధించిన నగదు కోసం శుక్రవారం చివ్వెంల వెళ్లిన లక్ష్మయ్యకు గోపి, శేఖర్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. లక్ష్మయ్యపై దాడి చేసి కొట్టటంతో గ్రామస్థులు అక్కడినుంచి పంపించారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు లక్ష్మయ్య తన ఇద్దరు భార్యలు వెంకటమ్మ, పద్మలతో కలిసి పోలీసుస్టేషన్‌కు వెళ్తున్న క్రమంలో పల్లపు గోపి, దండుగుల శేఖర్, పల్లపు రాఘవ, పసుపుల చంటి కారులో వెంబడించారు. బీబీగూడెం శివారులోని ఇండియన్ ఆయిల్ బంక్ దగ్గరికి రాగానే ద్విచక్ర వాహనాన్ని సమీపంలో ఉన్న మధురా వైన్స్ వద్ద నిలిపి లోపలికి పరుగెత్తారు. లక్ష్మయ్యపై దాడిచేసేందుకు కత్తితో వెంబడిస్తుండగా వైన్స్ దుకాణంలోనుంచి ఎక్కువమంది రావటంతో కర్రలు, కత్తులు సంఘటనా స్థలంలో విడిచి కారులో అక్కడినుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గోపి, శేఖర్, రాఘవ, చంటిలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రాణాలు తీసిన మతిమరుపు



రాములు(ఫైల్)

ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

చింతపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మతిమరుపు ఓ వృద్ధుడి ప్రాణంతీసింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తిరుమలాపురంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాంమూర్తి, తిరుమలాపురం స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలాపురం గ్రామానికి చెందిన గార్లపాటి రాములు(80) కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయన భార్య పదేళ్ల కిందట మృతి చెందగా కుమార్తె ఉన్నారు. కుమార్తె భారతమ్మకు వివాహంకాగా మండలంలోని కుర్మేడు గ్రామంలో ఉంటున్నారు. కొంతకాలంగా రాములు కుర్మేడులోని కుమార్తె ఇంట్లోనే ఉంటున్నాడు. కొంతకాలంగా రాములు మతిమరుపు సమస్యతో బాధపడుతున్నాడు. స్వగ్రామం తిరుమలాపురంలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్న విషయం తెలుసుకుని బుధవారం గ్రామానికి వచ్చారు. గురువారం రాత్రి గ్యాస్ స్టవ్‌పై వంట చేసుకుని భోజనం చేసి నిద్రించాడు. గ్యాస్ ఆఫ్ చేయకుండా నిద్రకు ఉపక్రమించాడు. కొంత సమయం తర్వాత రాములు లేచి చుట్ట తాగుతుండగా గ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు ధ్వంసమై స్లాబ్ కింద ఉన్న రాములుపై పడింది. భారీ శబ్దం రావడంతో మనుమడి స్నేహితుడు కుర్మేటి నవీన్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో స్లాబ్ కప్పును తొలగించగా రాములు శరీరం పూర్తిగా కాలిపోయి మృతి చెంది కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాములు మనుమడు గార్లపాటి ప్రవీణ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొండమల్లేపల్లిలో దొంగ రిమాండ్

కొండమల్లేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పోలీసులు దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్రోనితండా గ్రామపంచాయతీలో ఈ నెల 11న రాత్రి కొర్ర పట్టి ఇంట్లో దొంగతనం జరిగింది. దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్ నేతృత్వంలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం నిందితుడు కేతావత్ బద్య తన ఇంట్లో ఉండగా పట్టుకొని విచారించారు. రూ.1.50 లక్షల విలువైన కిలో వెండి చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నేరస్తుడి దగ్గర నుంచి సొమ్మును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ శరత్‌పవార్ అభినందించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భువనగిరి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట పరిధిలోని యాదగిరిపల్లికి చెందిన పుట్ట శివాజి, సోదరుడు పుట్ట బాలాజీలు రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ మండలంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కళాశాల నుంచి తిరిగి ద్విచక్రవాహనంపై ఇద్దరు యాదగిరిగుట్టకు వస్తున్నారు. భువనగిరి శివారులోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం నడుపుతున్న శివాజి తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలాజీకి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

భక్తుడూ భగవంతుడైన ఆలయం

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)



కొండలు, గుట్టలలో నిర్మించిన బాలాజీతులసీసాద్‌మహరాజ్ దేవాలయం, ఆలయంలో కొలువుదీరిన తులసీసాద్

భగవంతుడితో సమానంగా భక్తుడు సేవలందుకుంటున్న క్షేత్రం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గుట్టల్లోని తులసీసాద్ మహరాజ్ ఆలయం. నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి సమీపంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న గుట్టల్లో 200 ఏళ్ల కిందట బాలాజీ వేంకటేశ్వరస్వామి వెలిసినట్లు స్థానికుల నమ్మకం. అయితే స్థానికుడైన తులసీసాద్ అనే భక్తుడు పరమనిష్ఠతో స్వామిని ఉపవాస దీక్షలతో పూజలు చేశాడు. దీంతో అతడికి స్వామి దర్శనమిచ్చినట్లు పూర్వీకులు కథనం. అప్పటి నుంచి తులసీసాద్‌ను కూడా గిరిజనులు దైవంగా కొలవడం ప్రారంభించారు. బాలాజీ తులసీసాద్ పేరుతో రూ.కోటితో దేవాలయాన్ని నిర్మించి గిరిజనులు ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు.


ఏడు తరాల నుంచి వాకునావత్ పాడ వంశానికి చెందిన వారు పూజారులుగా కొనసాగుతున్నారు. చుట్టూ నలమల కొండలు, అడవులు, మూడు వైపులా కృష్ణా జలాలు మధ్యలో గుట్టపై వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించి స్వామి వారితో పాటు తులసీసాద్‌కు పూజలు చేస్తున్నారు. స్థానికులతో పాటు పరిసర తండాల భక్తులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల, ప్రకాశం, వివిధ జిల్లాల నుంచి భక్తులు దేవాలయానికి వచ్చి వేంకటేశ్వరస్వామితో పాటు తులసీసాద్‌మహరాజ్‌కు పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుంటారు.

ప్రతీ శనివారం భక్తులు పెద్దసంఖ్యలో దేవాలయాన్ని సందర్శిస్తుంటారు. కోరిన కోరికలు నెరవేర్చే దైవంగా బాలాజీ, తులసీసాద్‌మహరాజ్ దేవాలయానికి పేరొందింది. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి పొందిన వైజాగ్‌కాలనీకి వచ్చే పర్యాటకులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఈ ఆలయాన్ని సందర్శించి వెళ్తుంటారు. ప్రతీ ఏడాది శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు పూజారి వాకునావత్ బిక్కునాయక్ తెలిపారు.

ఆలయానికి ఇలా వెళ్లొచ్చు...

కాచరాజుపల్లిలోని బాలాజీతులసీసాద్ దేవాలయానికి ఇలా వెళ్లాల్సి ఉంటుంది. దేవరకొండ నుంచి పోలేపల్లి మీదుగా పెద్దమునిగల్, వైజాగ్‌కాలనీ, దుబ్బతండాకు రోడ్డు ఉంది. దేవరకొండ నుంచి తులసీసాద్ దేవాలయం 45 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు.

దేవాదాయ శాఖ సహకరించాలి



వకునావత్ వంశానికి చెందిన వారం బాలాజీతులసీసాద్‌మహరాజ్ దేవాలయంలో పూజలు చేస్తున్నాం. భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతుండటంతో భక్తుల రద్దీ పెరిగింది. దేవాదాయ శాఖ దేవాలయ అభివృద్ధికి సహకరించాలి. దేవాలయం చుట్టు కొండలు, గుట్టలు, నదీ జలాలు ఉండడంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

వాకునావత్ బిక్కునాయక్, ఆలయ పూజారి

తాళం వేసిన ఇళ్లలో చోరీలు

ఆలేరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతాపురిలో గ్రామంలో జరిగింది. సీఐ యాలాద్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సొప్పోజు కృష్ణ, పల్లె బాల్‌నర్సయ్యలు తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కృష్ణ ఇంట్లో రూ.70 వేల నగదును చోరీ చేశారు. శుక్రవారం ఉదయం గమనించారు. క్లూస్ టీమ్ సిబ్బంది రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన వేలిముద్రలను సేకరించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, పలువురికి కోర్టు జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన సూర్యాపేటలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఐదుగురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం తాగినట్లు గుర్తించామన్నారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, మిగిలిన నలుగురికి కలిపి రూ.3000 జరిమానా విధించినట్లు తెలిపారు.

అక్రమాలపై విచారణ

తిప్పర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ నిధులను వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించిన మండల స్థాయి అధికారితో పాటు ప్రధానోపాధ్యాయుడిపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలతో పాటు ఇండ్లూరు ప్రభుత్వ పాఠశాలలను పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు. ఈ క్రమంలో తిప్పర్తి హైస్కూల్‌కు రూ.8,78,490 నిధులు రాగా కాగా ల్యాబ్, గ్రంథాలయం కోసం మరో రూ.14.33 లక్షలు మంజూరయ్యాయి. ఇండ్లూరు ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.6.04 లక్షలతో పాటు అదనపు గదులకు మరో రూ 9.45లక్షలు మంజూరు చేశారు. కాగా ఈ నిధులను వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకున్నారన్న ఆరోపణలపై విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

నాబార్డు సహకారంతో సొసైటీలు మరింత బలోపేతం

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాబార్డు సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 108 సొసైటీలను మరింత బలోపేతం చేస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాబార్డు సీజీఎం ఉదయ భాస్కర్ శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. డీసీసీబీతో పాటు సొసైటీల అభివృద్ధిలో నాబార్డు పాత్ర ఎంతో ఉందని, భవిష్యత్తులో ఇదేవిధంగా సహకరించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో మరో ఆరు కొత్త బ్రాంచీల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించి కొత్త నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరుతూ సీజీఎంకు వినతిపత్రం అందించారు. అనంతరం సీజీఎం ఉదయభాస్కర్ మాట్లాడుతూ డీసీసీబీని సందర్శించడం ఆనందంగా ఉందని, డీసీసీబీతో పాటు సొసైటీలు అభివృద్ధి చెందడం ఎంతో సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లోనూ నాబార్డు సహకారం మరింత ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, సీఈవో శంకర్‌రావు, నాబార్డు డీడీఎంలు, బ్యాంకు డీజీఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌పవర్‌తో ఈవీ వాహనాలకు మేలు

● తెలంగాణ నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్



ఎఫ్‌పీవోను పరిశీలిస్తున్న నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్

కట్టంగూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్ సిస్టమ్ ద్వారా ఈవీ వాహనాలకు మేలు కలుగుతుందని తెలంగాణ నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్ అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాములలో కట్టంగూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ తరఫున నిర్వహిస్తున్న ఈవీ చార్జింగ్ స్టేషన్ ఆఫ్ గ్రిడ్ సోలార్ సిస్టమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవోలో జరుగుతున్న అన్ని రకాల పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌పీవోలు రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కృషి వికాస్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిరుద్యోగ యువతకు మేలు చేస్తుందన్నారు. సోలార్ పవర్ సిస్టమ్ ద్వారా ఈవీ వాహనాలకు పెద్ద ఎత్తున మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు నల్లగొండ డీడీఎం వినయ్‌కుమార్, సూర్యాపేట డీడీఎం రవీందర్‌నాయక్, కట్టంగూరు ఎఫ్‌పీవో చైర్మన్ చెవుగోని సైదమ్మ, అడ్వైజర్ నంద్యాల నర్సింహారెడ్డి, ఐఆర్‌డీఎస్ అధ్యక్షుడు రమేష్, సుధాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఏఓయూతో ఉన్నత విద్య అవకాశాలు

● యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్



కోదాడలో మాట్లాడుతున్న డాక్టర్ బి. ధర్మానాయక్

హుజూర్‌నగర్, కోదాడటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఎంతోమందికి ఉన్నతవిద్య అవకాశాలు లభిస్తున్నాయని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ బి.ధర్మానాయక్ అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ పట్టణాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కోదాడ కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధంగా ఉన్న స్టడీ సెంటర్‌కు రీజినల్ స్టడీ సెంటర్‌ను మంజూరు చేసినందుకు కృషిచేస్తానని అన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పెంచినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కేఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హదసరాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కంభంపాటి యాదగిరి, జర్నలిజం ప్రొఫెసర్ గిరిగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, కోఆర్డినేటర్ సైదులు, సైదిరెడ్డి, బాలరాజు, సైదా పాల్గొన్నారు.

వరుస వర్షాలతో పత్తికి జీవం

● కాతకు వచ్చిన పత్తి చేలు..
● దరి చేరని తెగుళ్లు.. రైతులలో ఆనందం



వర్షం అనుకూలించడంతో పూత, కాత దశకు వచ్చిన పత్తి చేను

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో పత్తి చేలు కాతకు వచ్చాయి. గత పక్షం రోజులుగా కురిసిన ఒక మోస్తరు వర్షాలకు పత్తి పంటకు జీవం పోయడంతో పాటు ఏపుగా వచ్చాయి. వర్షంతో పత్తి పంటకు ఎలాంటి నష్టం జరక్కపోవడం, తెగుళ్ల కూడా దరి చేరక పోవడం వంటి పరిణామాలతో రైతులలో ఆనందం వ్యక్తమవుతోంది. పత్తి చేలలో అక్కడక్కడ నిలిచిన వర్షపు నీటిని తొలగించి ముందు జాగ్రత్తగా అవసరమైన మందులను వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పిచికారి చేస్తున్నారు. చౌటుప్పల్ ఏవో ముత్యాల నాగరాజు పర్యవేక్షణలో క్లష్టర్లలోని ఏఈవోలు గ్రామాలు తిరుగుతూ పత్తి చేలకు సంబంధించిన సూచనలు, సలహాలను రైతులకు అందిస్తున్నారు. మునిసిపాలిటీతో పాటు రూరల్ మండలంలో 10,500ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. మే, జూన్ మాసాల్లో పత్తి విత్తనాలను విత్తిన చేలకు కాయలు బలంగా వచ్చాయని రైతులు తెలిపారు. అన్ని రకాలుగా అనువైన నల్లరేగడి భూముల్లో ఒక్కో పత్తి మొక్కకు 100కు పైగా కాయలు వచ్చే అవకాశం ఉంటుందని రైతుల అంచనా. వచ్చే నెల చివరి నాటికి పత్తి పంట చేతికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒక మోస్తారుగా కురిసిన వర్షాలకు పత్తి పంటకు ఎలాంటి తెగుళ్ల సోకలేదని. దీంతో అదనపు భారం కూడ తగ్గిపోయిందని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8100 ఉండడంతో పత్తి చేల సంరక్షణ పట్ల రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈసారి పత్తి పంట దిగుబడి అధికంగా వచ్చి ఆదాయం పెరిగే అవకాశాలు ఉంటాయని రైతులు ఆశాభాఆవం వ్యక్తం చేస్తున్నారు.

చౌటుప్పల్ మండలంలో సాగు ఇలా..

మండలంలో ప్రధానంగా ఆరెగూడెం, కాట్రేవు, పంతంగి, ఎస్. లింగోటం, నేలపట్ల, జైకేసారం, కుంట్లగూడెం, చిన్నకొండూరు, పెద్ద కొండూరు, శేరిల్లా, మశీద్ గూడెం, నక్కలగూడెం, తమ్మలోనిబావి, తంగడపల్లి, లింగోజిగూడ, లక్కారం, చౌటుప్పల్, లింగారెడ్డిగూడెం తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. గత సంవత్సరం 11,500 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ సారి 10,500 ఎకరాలలో పత్తి సాగు చేశారు. గత సంవత్సరం కంటే ఈ సారి 1000 ఎకరాలలో తక్కువగా పత్తి సాగు చేశారు.

రెండు నెలలు ముఖం చాటేసిన వరుణుడు

జూన్, జూలై మాసాల్లో వరుణుడు ముఖం చాటేయడంతో ఎండలు దంచికొట్టాయి. ఈ ఎండలకు పత్తి చేలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పాదుల్లోనే మాడిపోయిన విత్తనాల స్థానంలో మళ్లీ విత్తనాలను పెట్టవలసి వచ్చింది. దీంతో రైతులకు అదనపు భారం పడింది. అక్కడక్కడ పత్తి మొలకలు సైతం ఎండి పోయాయి. పత్తి చేలు ఎండి పోయే దశలో కురిసిన వర్షాలతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు మాసంలో కురిసిన వర్షాలు పత్తి చేలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

పత్తి చేలకు ఉపయోగపడిన వర్షం



పక్షం రోజులుగా కురిసిన వర్షం పత్తి చేలకు ఎంతగానో ఉపయోగపడింది. ఎర్రటి ఎండలకు పత్తి చేలు ఎండి పోయే దశలో కురిసిన వర్షాలు జీవం పోశాయి. వర్షాలు కురియకుంటే తీవ్ర నష్టం వాటిల్లేది. ఇప్పటి వరకు ఎలాంటి తెగుళ్ల కూడ సోకలేదు. రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాం. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

-ఢిల్లీ చంద్రకళ, మహిళా రైతు, డైరెక్టర్, ఏఎంసీ, చౌటుప్పల్

పత్తి చెట్టుకు50నుంచి 75 కాయలు వస్తాయి



నల్ల రేగడి భూముల్లో ఒక్కో పత్తి చెట్టు కు 50 నుంచి 75 కాయల వరకు వస్తాయి. ఎర్ర భూమి, దుబ్బ భూముల్లో 25 నుంచి 50 కాయలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదునులో వర్షాలు కురియడంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకున్న పక్షంలో పత్తి చేలు బలంగా పెరగడంతో పాటు కాయల సంఖ్య కూడ గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. పత్తి దిగుబడి దసరా పండుగ వరకు వస్తుంది. అదునుగా కురిసిన వర్షాలకు ఈ సారి తెగుళ్ల సోకలేదు. ఈ నెలలో కురిసిన కురిసిన పత్తి చేలకు ఎంతగానో మేలు చేశాయి. రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలను అందిస్తున్నాం.

-మస్క శంకరయ్య, ఏఈవో, జైకేసారం క్లస్టర్, చౌటుప్పల్

పొడి ఎండతో తెగుళ్ల నుంచి రక్షణ

వర్షాలు నిలిచి పోయి పొడి ఎండ వస్తుండడంతో పత్తి చేలకు తెగుళ్ల నుంచి కొద్దిగా రక్షణ ఏర్పడిందని చెప్పవచ్చు. సస్యరక్షణ చర్యలలో బాగంగా అవసరమైన మందులను పిచికారి చేసేందుకు పొడి ఎండ ఉపయోగపడుతుంది. కొంత మంది రైతులు డ్రోన్‌ల సాయంతో మందులను పిచికారీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రాచకొండ ఎత్తిపోతల పథకమే శరణ్యం

రైతు సంఘం పూర్వ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి



సంస్థాన్ నారాయణపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సాగునీటి వనరులు లేని ఈ ప్రాంతానికి సాగునీటి సౌకర్యం కల్పించేందుకు రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, విశ్రాంత ఇంజనీర్ల ఫోరం నాయకుడు ఇంద్రసేనారెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.జహంగీర్ కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రాచకొండ ఎత్తిపోతల పథకంపై సదస్సు నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో మల్లారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి సాగునీటి సౌకర్యం లేక సకాలంలో వర్షాలు లేక ఈ ప్రాంతమంతా కరువు కోరల్లో చిక్కుకుందని తెలిపారు. ఒక సంవత్సరం వర్షం పడితే నాలుగు సంవత్సరాలు కరువు బారిన పడి రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. డిండి ఎత్తిపోతల పథకం పేరుతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా శివన్నగూడెం చెరువులను నింపి అక్కడి నుంచి లిఫ్టులద్వారా మండలానికి సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయ తలపెట్టిన రాచకొండ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ప్రభుత్వం ఆమోదించలేదని అన్నారు. ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. శివన్న గూడెం రిజర్వాయర్ పూర్తికానిదే నారాయణపురం మండలంలోని గిరిజన తండాలకు ఇతర గ్రామాలకు నీళ్ల వచ్చే పరిస్థితి లేదని, మిట్ట ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతాలకు లిఫ్ట్ ద్వారానే సాగునీరు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చదువుకున్న నిరుద్యోగులు సైతం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాచకొండలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంతంలో సాగు తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వలసలు ఆగాలంటే సాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజ్, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, గుంటోజు శ్రీనివాస్‌చారి, దోడ యాదిరెడ్డి, దోనూరు నర్సిరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, దొంతగాని పెద్దులు, మల్లెపల్లి లలిత, చింతకాయల నరసింహ, పిట్టరాములు, ఐతరాజు గాలయ్య పాల్గొన్నారు

సాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

● 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల
● మూసీకి తగ్గిన వరద ఉధృతి



నాగార్జునసాగర్ నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్‌కు ఎగువ నుంచి 4,31,678 క్యూసెక్కుల నీరువచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, శుక్రవారం 583.50 అడుగులుగా(293.1090టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి మొత్తం 4,04,993 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తుండగా, ఎగువనుంచి 4,31,678 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

మూసీకి తగ్గిన వరద ఉధృతి

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గిపోవడంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ రిజర్వాయర్‌కు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 14 రోజులుగా మూసీ ఉధృతంగా ప్రవహించి భారీగా వరద చేరడంతో 13 రోజులపాటు ప్రాజెక్టు క్రస్టుగేట్లు ఎత్తి వరదను దిగువ మూసీకి వదిలారు. ఎగువనుంచి 3,891.36 క్యూసెక్కుల వరద వస్తుండగా, ఒక గేటు నుంచి 640.79క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు శుక్రవారం సాయంత్రానికి 643.25 అడుగులుగా(4టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ఆయకట్టుకు 526.19 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది.



కేతేపల్లి పరిధిలో నిండుకుండలా మూసీ

జయశంకర్ మూడు తరాల ఉద్యమ వంతెన

● తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య



స్మారకోపన్యాస సమావేశ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య

మిర్యాలగూడ, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ మూడుతరాల తెలంగాణ ఉద్యమానికి వంతెనగా మారి తీరం చేర్చిన వైతాళికుడని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం టీవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ 14వ స్మారకోపన్యాసం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నాగయ్య మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం దోపిడీ విధానాలు కొనసాగుతాయని విద్యావంతులు మౌనంగా ఉంటే భవిష్యత్తు సమాజాన్ని కాపడలేమని ముందుగానే సమాజాన్ని చైతన్యవంతం చేసిన మేధావి అని అన్నారు. దేశంలోని నేల, నీరు, అడవులు కార్మిక మానవశక్తులను పాలకులు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు ధారపోస్తున్నారని ఆరోపించారు. విధ్వంసక పాలనా విధానాలపై జయశంకర్ చూపిన బాటలో నడుస్తూ చారిత్రక ప్రాధాన్యత, వర్తమాన పోరాట పటిమ కలిగిన సంస్థగా టీవీవీ పనిచేస్తుందని అన్నారు. హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేట్, ఈసీ ఆడిటోరియంలో ఆగస్టు 24వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు జయశంకర్ స్మారకోపన్యాస సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి టీవీవీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీవీవీ రాష్ట్ర నాయకులు బెల్లకొండ హరికృష్ణ, నారాయణరెడ్డి, డేగవీటి, రాముడుశర్మ, సింధు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలిలా!

వినాయక చవితిని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీ నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవకమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు సూచిస్తున్నారు. గణేష్ మండపాలకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను జారీ చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతుంది. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతిష్ఠించే విగ్రహాలఎత్తు, మండపం ప్రదేశం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం తదిత ర వివరాలతో కూడిన సమాచారాన్ని దరఖాస్తులో సమర్పించాల్సి ఉంటుంది. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే అనుమతి తో పాటు క్యూఆర్ కోడ్‌ను అధికారులు జారీ చేస్తారు.

- (ఆంధ్రజ్యోతి, చండూరు)

దరఖాస్తు చేసుకోవడం ఎలా?

మండపం ఏర్పాటు కోసం పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. https://policeportal.ts police.gov.in వెబ్‌సైట్‌లో అనుమతి కోసం వివరాలను నమోదు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ ఆధారంగానే అనుమతులు జారీ అవుతాయి. మండపాల్లో పోలీసుల అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీసు సూచనలను విధిగా ప్రదర్శించాలి.



ఘర్షణలకు తావివ్వొద్దు

గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి. ఎత్తయిన గణేష్ విగ్రహాలు పెట్టేవారు విద్యుత్ వైర్లు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యువత స్నేహపూర్వకంగా మెలగాలి. ఘర్షణలకు తావివ్వకుండా పోలీసుల సూచనలు పాటించాలి. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవు.

- ఎన్ వెంకన్న, ఎస్‌ఐ, చండూరు

» విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
» ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం » రూ.500 డీడీ చెల్లిస్తేనే విద్యుత్ కనెక్షన్

పోలీసుల సూచనలు పాటించాలి

- గణేష్ మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే.
- ప్రతీ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలి.
- గణేష్ మండపాలు ప్రజా రవాణా, ఎమర్జెన్సీ వాహనాలు,ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.
- మండపం స్థలంకోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలి.
- రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ స్పీకర్లు వినియోగించాలి.
- డీజేలకు అనుమతి లేదు.
- గణేష్ మండపాల వద్ద మద్యం తాగడం, పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు చేయడం, అన్యమతస్థులను కించపరిచేలా ప్రసంగించడం, పాటలు పాడటం పూర్తిగా నిషేధం.
- ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత పోలీస్ వారికి లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.

విద్యుత్ అధికారుల సూచనలు

- గణేష్ మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. » ఎత్తయిన విగ్రహాలు తీసుకు వచ్చేటప్పుడు విద్యుత్ లైన్లు అడ్డం వస్తే అధికారులకు తెలియజేసి విద్యుత్ సరఫరాను నిలిపివేసిన అనంతరం తీసుకెళ్లాలి.
- మండపాల వద్ద విద్యుత్ సరఫరాకు రూ.500 డీడీని విద్యుత్‌శాఖకు చెల్లిస్తే అనుమతి ఇస్తారు.
- వర్షాకాలం కాబట్టి మండపాల వద్ద ఇనుప పైపులతో మండపం నిర్మించుకుంటే, విద్యుత్ వైర్‌ను పైపులకు చుట్టవద్దు.
- మండపానికి విద్యుత్ సరఫరా చేసే వైర్ నాణ్యమైనది మాత్రమే వాడాలి. అతుకుల వైర్‌ను వాడవద్దు. గణేష్ మండపాలకు, విగ్రహాలకు చిన్న చిన్న లైట్లు వాడకూడదు. విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.
- మైక్‌సెట్‌లు, సౌండ్ బాక్స్‌లు పెట్టే దగ్గర అనుభవజ్ఞులైన మెకానిక్‌లతోనే ఏర్పాటు చేపించాలి.
- కమిటీ సభ్యులకు ఏమైనా విద్యుత్ ప్రమాదం జరిగినా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి.

జిల్లా స్థాయి యోగా పోటీలు రేపు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న తేదీన నల్లగొండ పట్టణంలోని సీపీఎం భవన్‌లో జిల్లాస్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల వారీగా ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు ఉదయం 9గంటలలోపు బోనఫైడ్, ఆధార్ కార్డు పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9885140616 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈగా బద్రునాయక్



నల్లగొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఇరిగేషన్ సర్కిల్ నూతన ఎస్‌ఈగా ధారావత్ బద్రునాయక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బద్రునాయక్ గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ హోదాలో పలు ప్రాంతాల్లో పనిచేసి మంచిగుర్తింపు పొందారు. ఈసందర్భంగా బద్రునాయక్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కార్యాలయంలోని అసిస్టెంట్ ఇంజనీర్ రాజారత్నం, టెక్నికల్ సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది ఎస్‌ఈని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భానుపురి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట టౌన్-1,2 పరిధిలోని సబ్‌స్టేషన్, విద్యుత్‌లైన్ల మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు యశ్వంత్ సురేష్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గిరినగర్, హనుమాన్‌నగర్, దాసాయిగూడెం రోడ్డు, ఈనాడు ఆఫీస్, హోటల్ రిధికా దగ్గర మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యూరియా సక్రమంగా సరఫరా చేయాలి

చిలుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రైతులకు ఇబ్బంది తలెత్తకుండా సక్రమంగా యూరియాను సరఫరా చేయాలని తహసీల్దార్ ధ్రువకుమార్ సూచించారు. స్థానిక సహకార సంఘంలో యూరియా నిల్వ స్టాక్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దన్నారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, ఏవో శ్రీధర్, ఆర్ఐ సీతారామచందర్‌రావు, సీఈవో లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఆదివాసీల హక్కులను కాపాడాలి

కోదాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల హక్కులను కాపాడాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు మొగలిచర్ల అంజయ్య అన్నారు స్థానిక ఎంఎస్ కళాశాలలో ఆదివాసీ హక్కులు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 24న వరంగల్‌లో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని పీడీఎం నాయకులు పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల సాధన కోసం బహిరంగ సభను ప్రజాస్వామ్య వాదులు, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయిపూడి చిన్ని, నాగిరెడ్డి, నర్సింహారావు, ఉదయగిరి, ముత్యాలు, నహీం,శ్రీనివాసరావు, అంజి, రామారావు, సుందర్‌బాబు, గురునాధం పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి

చింతలపాలెం, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత వెల్లటూరు ముక్త్యాల బ్రాంచ్‌కెనాల్ పైప్‌లైన్ల కోసం భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన రైతులకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని రైతులు ఆర్డీవో శ్రీనివాస్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. పాత వెల్లటూరు గ్రామ రైతులు దగ్గర నుంచి పైపులైన్ల కోసం సేకరిస్తున్న భూములకు దారుణంగా నష్టపరిహారం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇళ్ల పక్కన కాల్వ పనులు చేస్తున్న సమయంలో డిటోనేటర్ సాయంతో రాళ్లు పగలకొట్టడంతో ఇళ్లపై రాళ్లు పడటం, ఇంటిగోడకు పగుళ్లు ఏర్పడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో తాసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఆర్ఐ ఆత్రేయ పాల్గొన్నారు.

యూరియా కొరత నివారణకు చర్యలు

కోదాడరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏడీఏ ప్రశాంతి అన్నారు. మండలంలోని ఎర్రవరం, కోదాడ, చిమిర్యాల, కాపుగల్లు, సహకార సంఘాల్లో ఉన్న యూరియా, డీఏపీ ఉన్న నిల్వల వివరాలు శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాపుగల్లులో విలేకరులతో మాట్లాడుతూ రైతులు నానో యూరియాను వరిపైరుపై స్ప్రే చేయాల్సిందిగా ఆమె కోరారు. కార్యక్రమంలో ఏవో రజని, పీఏసీఎస్ నంబూరి సూర్యం, డైరెక్టర్ వీరబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

మేళ్లచెర్వు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో విస్తరించిన అటవీశాఖ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించారని అటవీ శాఖ రేంజర్ అధికారి ఆదిత్యకు స్థానిక పశువుల కాపరులు ఫిర్యాదు చేశారు .మండలంలోని అటవీ ప్రాంతాన్ని కొందరు దళారులు ఒక్కొక్కరు 50 నుంచి 100 ఎకరాల అటవీ భూములను ఆక్రమించి పొలం చుట్టూ తాత్కాలికంగా ఫెన్సింగ్ వేసి గేదెలు కాపరులను రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు విచారించి అటవీ భూములను కాపాడి పశువులు మేపుకొనేందుకు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ ఇన్‌చార్జి ప్రేమజ్యోతి, ఫారెస్టు బీట్ అధికారి వినోద్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



హుజూర్‌నగర్‌లో అరెస్టు అయిన బీజేపీ నాయకులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ :ప్రజాసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జిల్లాలోని పలు మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ బయలు దేరి వెళ్తున్నారని సమాచారంతో వారిని ముందస్తు అరెస్టు చేశారు. హుజూర్‌నగర్ నాయకుడు కొండా హరీష్, మఠంపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటశివ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తు న్న పార్టీ శ్రేణులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. హుజూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి తల్లి సత్యవతి, కుంభం వీరయ్య, శివాజీనాయక్, కోటేశ్వరరావు, కొండలు తిరుమలగిరిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ రెడ్డి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, చిలుకూరులో బీజేపీ మండల అధ్యక్షకార్యదర్శులు పారెల్లి మహేష్, కొండా శ్రీను అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడు శ్యామ్ సుందర్‌రెడ్డి మృతి



నూతనకల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సమితి మాజీ అధ్యక్షుడు జెన్నారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి (95) గురువారం రాత్రి గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి చెందారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఆయన మృతికి మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి. చెవిటి వెంకన్నయాదవ్, సూర్యాపేట, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్లు కొప్పుల వేణారెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నా గం జయసుధాసుధాకర్‌రెడ్డి, సంతాపం తెలిపారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం ఎర్రపహాడ్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు.

'కూలీలకు ఇందిరమ్మ భరోసా అందించాలి'

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ కోరారు. మండలంలోని అమరవరంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ కూలీల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఏడాదికి ఈ పథకం ద్వారా రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. . సమావేశంలో లింగమ్మ, భద్రమ్మ, వెంకమ్మ, సోమమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ..

» తిరుమలగిరికి 5 ఓవర్‌హెడ్ ట్యాంకులు మంజూరు



తిరుమలగిరి సంతలో ఉన్న నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంకు

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి): మునిసిపాలిటీల్లో ప్రజల జీవన నాణ్యతను పెంచి, తద్వారా స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పెరుగుతున్న జనాభాకు స్వచ్ఛమైన నీటిని అందించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్‌కోసం నిధులు కేటాయించింది. ఈక్రమంలో తిరుమలగిరి మునిసిపాలిటీకి 5 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. దీంతో మునిసిపాలిటీకి నాలుగు వైపులా ఓవర్‌హెడ్ ట్యాంకుల కోసం స్థలాలను సేకరించి, ట్యాంకుల నిర్మాణాలను ఇటీవల ప్రారంభించారు మునిసిపల్ పరిధిలో మొత్తం 5 ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం కోసం రూ.30 కోట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా 5చోట్ల ట్యాంకుల నిర్మాణాలు మొదలుపెట్టారు. పెరగనున్న జనాభా దృష్ట్యా 2040 సంవత్సరం వరకు ప్రజలకు తాగునీటి అవసరాలకోసం ప్రభు త్వం దృష్టిలో పెట్టుకుని ఈపథకం రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. 2026 నాటి కల్లా ట్యాంకుల నిర్మాణాలు పూర్తవుతాయని తెలిపారు.

మిషన్ భగీరథకు అనుసంధానం

ఓవర్‌హెడ్‌ట్యాంకుల నిర్మాణం పూర్తిచేసి, ఈ ట్యాంకుల ను మిషన్ భగీరథ నీటికి అనుసంధానం చేయనున్నారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని, ఈట్యాంకుల్లో నింపి ప్రజల అవసరాలకు వాడనున్నట్లు అధికారులు తెలిపారు.

17 లక్షల ట్యాంకుల నీటి సామర్థ్యం

మునిసిపల్ పరిధిలో అమృత్ పథకం 2.0 ద్వారా 17 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల 5 ఓవర్‌హెడ్ ట్యాం కుల నిర్మాణం చేపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కేంద్రంవాటా 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 50 శాతం నిధులతో ఈపథకం ద్వారా భవిష్యత్ నీటి అవసరాలను తీర్చడం కోసం పట్టణ కేంద్రాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

నిర్ణీత సమయంలో పూర్తి చేయిస్తాం

తిరుమలగిరి మునిసిపాలిటీకి 5 ఓవర్‌హెడ్ ట్యాంకులు కేటాయించారు. ట్యాంకుల నిర్మాణం, పైపులైన్‌ల కోసం రూ.30 కోట్లుమంజూరయ్యాయి. నిర్ణీత సమయానికి ట్యాంకుల, పైపులైన్‌ల నిర్మాణాలు పూర్తి చేయించి, వినియోగంలోకి తీసుకువస్తాం.

- అనిల్, డీఈ

25 నుంచి స్కూల్ గేమ్ మండల స్థాయి పోటీలు

హుజూర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి: హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంప్‌లో ఈనెల 25, 26 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సైదానాయక్, పీడీ రవికుమార్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అండర్-17 బాల బాలికల పోటీలను రెండురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఎస్ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుపాటి బాబూరావు కోరారు. శుక్రవారం పట్టణానికి చెందిన చెరుకుపల్లి గోపి బేగం అనే మహిళకు ఓ-నెగిటివ్ రక్తం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ముల్కలపల్లి రాంబాబు, అను, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి పల్లెకూ బీటీ రోడ్లు నిర్మిస్తా



మోతె : బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి

మోతె,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి పల్లెకూ బీటీ రోడ్లు నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి అన్నారు. మండలంలోని నామవరం నుంచి మునగాల మండలం సీతానాగారం తండా వరకు సీఆర్ఆర్ నిధులు రూ.4 కోట్లతో నిర్మించనున్నట్లు బీటీ రోడ్డు పనులకు నామవరంలో శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ద్వారా వస్తున్న పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.అనంతరం వివిధ గ్రామాలకు చెందిన వారు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డీవో వేణుమాధవ్, మండల ప్రత్యేకాధికారి సీతారామ్‌నాయక్, వివిధశాఖల అధికారులు నాయకులు పుల్లారావు, కీసర సంతోష్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, మైనంపాటి గుర్వారెడ్డి, రామాచారి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

●చిలుకూరు: మండల కేంద్రంలో కోదాడ, జడ్చర్ల రహదారి నుంచి జానకీనగర్ వరకు రూ.1.08 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పద్మావతీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వంలో గ్రామీణ రహదారులను పట్టించుకోలేదని తమ ప్రభుత్వ హయాంలో అవసరమైన అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని ఆయన అన్నారు. అనంతరం చెన్నారిగూడెంలో రూ.1.53 కోటతో చెన్నారిగూడెం నుంచి ఎస్ఎస్సీ మెయిన్ కెనాల్ వరకు నారాయణపురంలో రూ.2.64 కోట్లతో నారాయణపురం నుంచి తొగర్రాయి వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు, ఎంపీఓ నర్సింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, టి. హనుమంతరావు, మాజీ ఎంపీపీ నాగేంద్రబాబు, వెంకట్‌రెడ్డి, పుల్లారావు పాల్గొన్నారు.

● కోదాడరూరల్ : కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 3.14 కోట్లతో ఏర్పాటు చేసిన సిటీ స్కానర్‌ను ఎమ్మెల్యే పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.26 కోట్ల వంద పడకల ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, యర్నేని వెంకటరత్నంబాబు, వరప్రసాద్‌రెడ్డి, ఈదుల కృష్ణయ్య, ఆర్డీవో సూర్యనారాయణ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, ఆసుపత్రి సూపరిటెండెంట్ దశరథనాయక్, సీతారామిరెడ్డి, కాపుగల్లు పీఏసీఎస్‌చైర్మన్ నంబూరి సూర్యం పాల్గొన్నారు.

● మునగాల : మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పనుల ప్రారంభోత్సవంలో భాగంగా మొక్కలను నాటి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడారు. మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.80ల మంజూరైనట్లు తెలిపారు అలాగే నడిగూడెం తెల్లబెల్లిలో కాంగ్రెస్ నాయకులు రెడ్డిబోయిన రవి కుమార్తె బడేటి యమున మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో రమేష్‌దీన్ దయాల్, కొప్పుల జైపాల్‌రెడ్డి, కాసర్ల కోటేశ్వరరావు, నల్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● అనంతగిరి : మండలంలోని వాయిలసింగారం గ్రామ సంఘబంధం-1కు చెందిన బాలాజీ సమభావన సంఘం సభ్యురాలు తెలగపల్లి చిలకమ్మ ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందింది. దీంతో మంజూరైను రూ. 10 లక్షల బీమా చెక్కు చిలకమ్మ భర్త సత్యనారాయణకు శుక్రవారం గోండ్రియాల ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో అనంతగిరి మండల మహిళా సమాఖ్య ఏపీఎం సౌజన్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముసుకు శ్రీనివాసరెడ్డి, సీసీలు లక్ష్మీయేసు, సీఓ లావణ్య, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

మోతె, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి సీతారామ్‌నాయక్ అన్నారు. మండలంలోని హుస్సేనాబాదలో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పశువుల కొట్టంషెడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న సీసీరోడ్డు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్ : మండలంలోని మహ్మదాపురం, దుబ్బతండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ఇంకుడుగుంతలు, పశువుల కొట్టల నిర్మాణ పనులకు ఎంపీడీవో అవిరెండ్ల జానయ్య భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు ఈనెల 30వ తేదీవరకు పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రవి, ఈసీ మహేష్, పంచాయతీ కార్యదర్శులు రజిని, లావణ్య, టీఏలు రాంకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు కవిత, నర్సయ్య, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● గరిడేపల్లి : మండలం కేంద్రంలోని ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పశువుల కొట్టాన్ని లబ్ధిదారులతో మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఉపాధిహామీ పనులు ఎక్కువ రోజులు చేసిన వారిని, ఉత్తమ సేవలు అందించిన పంచాయతీ సిబ్బంది మల్టీ పర్పస్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ గౌడ్, పెండెం ముత్యాలు గౌడ్, ఎంపీడీవో ఆర్.సరోజ, ఏపీఓ సురేష్, లక్ష్మారెడ్డి, బండ నర్సిరెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● నూతనకల్ : మండల కేంద్రంలో నిర్వహించిన పనుల జాతర గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధాసుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి ఉపాధి కూలీ వంద రోజులు పనులు పూర్తి చేయాలన్నారు. రైతులు ఉపాధి హామీ పథకంలో నిర్మించే పశువుల కొట్టాలను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఏపీవో శ్రీరాములు, కార్యదర్శి శర్మ ఉన్నారు.

● అనంతగిరి : మండలంలో ఖానాపురం గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ పనుల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్త మ పనితీరు కనబర్చిన పంచాయతీ సిబ్బందిని, కంటు నరేష్‌ను సన్మానించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామప్రత్యేక అధికారి జి.రత్న రిత్విక్,కార్యదర్శి అక్షయ్ తేజ, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ గింజుపల్లి రమేష్, ఏఎన్ఎం పద్మావతి పాల్గొన్నారు.

● మఠంపల్లి : మండలంలోని హ నుమంతులగూడెం మండల ప్రత్యేకాధికారి రవి, బక్కమంతులగూడెంలో ఎంపీడీవో వెంకటాచారి పశువుల షెడ్లను ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఆయా పంచాయతీ పరిధిలో ప్రత్యేకాధికారుల సమక్షంలో గ్రామ సభలను నిర్వహించి పనుల జాతరను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో ఉమా, ఈసీ సందీప్, టీఏలు, ఎఫ్ఏలు, పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌కు మరో రింగ్ రోడ్డు !

(5వ పేజీ తరువాయి)

విన్నవించారు. ఆక్రమణలో ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేసి మరో రింగ్ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. కాల్వ కట్టపై ఉన్న వారి ఇళ్లలోని వ్యర్థాలు కాల్వలో వదులుతుండటంతో స్థిరీకరించిన ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. చెత్తాచెదారంతో కాల్వలు నిండిపోతున్నాయి. కాల్వకట్టపై నివాసం ఉంటున్న వారికి శాశ్వత పరిష్కారం లభిస్తే అటు కాల్వకు కూడా మహర్దశ పట్టనుంది.

కొత్తగా ఆరు కిలోమీటర్లు

నూతనంగా ప్రతిపాదించిన రింగ్ రోడ్డు సుమారు ఆరు కిలోమీటర్లు ఉండనుంది. పట్టణంలోని కోదాడ రోడ్డులోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం నుంచి తూర్పు వైపు గడ్డిరెడ్డి ఫంక్షన్ హాల్ వరకు, అదేవిధంగా ఆంజనేయస్వామి దేవాలయం నుంచి దీక్షిత్‌నగర్, సీతారాంనగర్, ఎన్ఎస్‌పీ క్యాంప్,ఎన్టీఆర్ నగర్, శ్రీనగర్ కాలనీ మీదుగా లింగగిరి రోడ్డులోని కాచవారిగూడెం స్టేజీ వరకు వరకు ఈ నూతన రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాగా ఈ అంశంపై మంత్రి ఉత్తమ్ అధికారులను సర్వే చేయాలని ఆదేశించిన నేపథ్యంలో రింగ్‌రోడ్డు నిర్మాణంపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి.

నూతన రింగ్ రోడ్డు నిర్మించాలి



పట్టణంలోని లింగగిరి మేజర్‌కు ఎడమ వైపున నూతన రింగ్ రోడ్డు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. పట్టణంలో వాహనాల రద్దీ పెరిగింది. దీంతో పాటు కాల్వ కట్టలపై ఉన్న పేదలకు ఫణిగిరి గట్టు వద్ద నివాసం కల్పించి రోడ్డు నిర్మించాలని మంత్రి ఉత్తమ్‌కు విన్నవించాం. ఈ విషయంపై మంత్రి స్పందించి సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు.

-గూడెపు శ్రీనివాసు, మాజీ ఎంపీపీ

సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి



లింగగిరి మేజర్ కాల్వ కట్టపై రెండువైపులా రింగ్ రోడ్డు నిర్మించి కాల్వపై సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటుచేయాలి. దాంతో పాటు వీటిని గ్రిడ్‌కు అనుసంధానించాలి. దీంతో ఎన్నెస్పీకి ఆదాయం కూడా పెరుగుతుంది. పట్టణ పరిధిలో కాల్వపైన ఈ సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం వల్ల పట్టణంలో సుందరీకరణ జరుగుతోంది.

-ఆదెర్ల శ్రీనివాసరెడ్డి

శాకంబరీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత



నేరేడుచర్ల : శాకంబరీ దేవి అలంకరణ

నేరేడుచర్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం చివరి శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలోని విజయదుర్గా ఆలయంలో అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా, వేద మం త్రాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక సాయి సప్తగిరి కూరగాయల మార్కెట్ ఆధ్వర్యంలో వివిధ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలను అందించగా శాకంబరి మాతగా అలంకరించారు. పూజారి మొలుగు శ్రీనివాసాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

సూర్యాపేటటౌన్, మఠంపల్లి, హుజూర్‌నగర్ రూరల్ : జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో మహిళలు కుం కుమార్చన చేశారు. వేకువజాము నుంచి సంతోషిమాతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మట్టపల్లి దేవస్థాన ఆధ్వర్యంలో ఉచిత సాముహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవా రం గోపూజ, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, వీణ, ఉపేందర్, మమత, చారి, కరుణ, సాయికిరణ్, గురవయ్య, అంజయ్య, హరీష్, కృష్ణప్రసాద్, ఈవో లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



సూర్యాపేట కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సంక్షిప్తంగా..

● మునగాల : మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సరిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నడిగూడెం తహసీల్దార్ పని చేసి బదిలీపై మునగాలకు వచ్చారు. గత వారం రోజుగా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేసిన చంద్రశేఖర్ కోదాడ ఆర్డీవో కార్యాలయానికి డీవోగా బదిలీ అయ్యారు.

● తిరుమలగిరి : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్‌ఆధ్వర్యంలో తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం కాలేజీలో పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుండాల మురళీధర్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి సుందర్, రామచంద్రన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, బుక్కశ్రీను, సోమేష్, శ్రీను పాల్గొన్నారు.

● అనంతగిరి :మండలంలోని అమీనాబాద్ గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయుడు ఎంఏ గఫార్ రూ. 5 వేల విలువైన వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాత గ్రామ పెద్దలు వాటర్ బాటిల్స్ అందజేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శకుంతల, హరినాథ్, శ్రీనివాసరావు, చందర్‌రావు పాల్గొన్నారు.

●తిరుమలగిరి : మండలకేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం దివ్యాంగుల కోసం సమగ్ర శిక్ష, అలీంకో సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 1నుండి 18ఏండ్ల దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శాంతయ్య, హెచ్ఎం దామెర శ్రీనివాస్. భిక్షపతి, ఐఆర్పీపాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ సీఐ చరమందరాజుకు ఎస్పీ నర్సింహ సూర్యాపేటలో శుక్రవారం క్యాష్ రివార్డును శుక్రవారం అందజేశారు. మఠంపల్లి మండలంలో జరిగిన హత్య కేసులో నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చి ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతుండగా ఆ వ్యక్తిని పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో ఎస్పీ నర్సింహ సీఐను అభినందిస్తూ రివార్డు అందజేశారు.

●హుజూర్‌నగర్ :దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని 8వ వార్డుతో పాటు పలు ప్రాంతాల్లో దోమల నివారణకు బ్లీచింగ్, స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ చేయించారు. కార్యక్రమంలోశానిటరి ఇన్‌స్పెక్టర్ మెరిగె అశోక్ పర్యావరణ ఇంజనీర్ అంతటి రాజశేఖర్‌గౌడ్, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిరాల రామకృష్ణ పాల్గొన్నారు.

● తుంగతుర్తి :మండల కేంద్రంలో ఎలక్ట్రికల్స్ అండ్ సానిటరీ కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రచ్చ చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా నరాల సురేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి స్వర్గం మల్లయ్య, కోశాధికారి వరుణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రచ్చ చంద్రమౌళి మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ ఎన్నికకు సహకరించిన కార్యవర్గ సభ్యులు గుండగాని రామకృష్ణ, నారాయణదాసు నర్సయ్య, గొడుగు యాదగిరి, స్వర్గం కరుణాకర్, గోపగాని వెం కన్న, అంజయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

గో బ్యాక్ మార్వాడీ

తుంగతుర్తి, మేళ్లచెర్వు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా ఓయూ జేఏసీ పిలుపుమేరకు మార్వాడీ గో బ్యాక్ అంటూ స్థానిక వ్యాపారులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తుంగతుర్తి, మేళ్లచెర్వు మండలాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేశారు. మెయిన్ రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు.

అనంతరం మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర వ్యాపారులు రాష్ట్రంలో వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ స్థానిక వ్యాపారస్థులను నష్టపోయే విధంగా చేస్తున్నారని అన్నారు. మేళ్లచెర్వులో మార్వాడీ దుకాణాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో రాష్ట్ర ఉద్యమానికి మద్దతుగా స్వచ్ఛందంగా దుకాణాలను బంద్ చేసి, వివిధ రకాల వ్యాపారులు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.

విజృంభిస్తున్న డెంగీ కేసులు


(5వ పేజీ తరువాయి)

చేపట్టా రు. వైద్యసిబ్బంది రక్త నమూనాలను తీసి సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపించి పరీక్షలు చేయిస్తున్నారు. డెంగీ కేసు నమోదైన చోట 50 ఇళ్లను సర్వే చేయించి నమూనాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 4 లక్షల ఇళ్లలోని 11 లక్షల మందికి సర్వే చేయించినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

అనంతారంలో ముగ్గురికి డెంగీ ఫీవర్

పెన్‌పహాడ్ : మండలంలోని అనంతారంలో డెంగీ బాధితులను వైద్యాధికారులు గుర్తించారు. మామిడి లక్ష్మయ్య, నిమ్మల సుగుణమ్మ, షేక్ సాామ్రిన్(బాలింత)కు డెంగీతో బాధపడుతున్నారని తెలుసుకున్న మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ తమ వైద్యసిబ్బందితో శుక్రవారం బాధితులను పరీక్షించారు. అదేవిధంగా బాధితుల చుట్టుపక్కల ఇళ్ల వారి రక్తనమూనాలను సేకరించారు. గ్రామంలో వారం రోజులు పాటు హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు కార్యదర్శి వీరబోయిన సోమయ్య తెలిపారు.

సీజనల్ వ్యాధులు వస్తున్నాయి



సీజనల్ వ్యాధులలో భాగంగా జ్వరాలు వస్తున్నాయి. గ్రామాల్లో ఇంటింటి సర్వేలు చేయిస్తున్నాం. నమూనాలు సేకరించి పరీక్షలు చేయిస్తున్నాం. జిల్లాలో 67 డెంగీ కేసులు నమోదయ్యాయి. సిబ్బందిని ఎప్పటికప్పుడు సన్నద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషదాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలి.

చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో